# విజేత ?

మారుతీరావు ఆఫీసుకొచ్చేసరికి కిష్కింధకాండ వాతావరణం కనిపించింది. గట్టిగట్టిగా వాదించుకుంటున్నారు కొందరు. కొద్దిమంది కుర్చీలు వదిలేసి టేబుల్స్‌పై కూర్చున్నారు.

ఇంకా కొందరు పేపరు వెయిట్లు చేతిలో పట్టుకుని ఊగిపోతున్నారు.

"సైలెన్స్ ! వాటీజ్ దిస్? ఇది ఆఫీసు అనుకున్నారా-అసెంబ్లీ అనుకున్నారా?" గట్టిగా కోప్పడ్డాడు మారుతీరావు.

"అరే! మీరు క్యాంపుకు పోలేదా సార్!" బోల్డు హాశ్చర్యపోయాడు మబ్బురెడ్డి అనబడే సదరు సుబ్బారెడ్డి.

"అంటే- నేను క్యాంప్‌కు పోతే ఇలానే ఉంటారా?" రెచ్చిపోయి గుచ్చి గుచ్చి అడిగాడు మారుతీరావు.

"అదేంకాదు సార్! ఈసారి మన సదానందం భారీగా బెట్టులు గెల్చిండు సార్! పార్టీ ఇమ్మంటే ఇవ్వనంటున్నాడు" వివరించాడు పి.య్యే చిదానందం.

"ఇంతకీ ఏం బెట్టు ఏమా కథ?" ఆసక్తిగా అడిగాడు మారుతీరావు.

"ఎలక్షన్లలో ఎవరు గెలుస్తారని పందెం వేసుకున్నారు చాలామంది...ముఖ్యంగా ఇది మన సదానందంకు- అవతారంకు మధ్య మరీ రంజుగా సాగింది. సదానందం వెయ్యిరూపాయిలు పందెం గెలిచాడు. కాని అవతారం తాను అంతపెట్టలేదు- అబద్ధం ఆడుతున్నాడని చెబుతున్నాడు" చిదానందం నిదానంగా వివరించాడు.

కాసేపు విన్న తర్వాత మారుతీరావు చిందులు వేశాడు తారాస్థాయిలో అరుస్తూ-మధ్యలో టేబులు మీద వున్న పేపరువెయిట్లను నేలమీదకు విసిరికొట్టాడు.

''నేను చాలాకాలంగా గమనిస్తున్నాను- ఆఫీసులో డిసిప్లిన్ బాగా తగ్గిపోయింది...క్రమశిక్షణ కరువైంది. నేనిది సహించను. ఇన్నాళ్లూ నాలోని మంచితనమే చూశారు. నా అసలు రూపం చూడలేదు. నేను తలచుకున్నానంటే తోకలు కత్తిరించేస్తాను జాగ్రత్త!" అంటూ ఆవేశపడ్డాడు. అరిచి అరిచి ఛాంబర్‌లోకి పోయి కుర్చీలో వాలిపోయాడు. తుపాను వెలసిన ప్రశాంతత ఆఫీసులో ఆవరించింది.

ఓ గంట తరువాత పిలుపు వచ్చింది- పందాలు వేసుకునే సదానందంకు- అవతారంకు మేనేజరు నుంచి.

"అబద్ధాలు చెప్పడం కూడా ఓ కళ!" అన్నాడు మారుతీరావు.

"ఇంతకూ మమ్మల్ని ఎందుకు పిలిపించారు?" సదానందం ప్రశ్న.

"చెబుతా-చెబుతా! ఎన్నాళ్ళు ఇలా పదులు వందలు పందెం కడతారు- ధైర్యం ఉంటే మొగాళ్ళయితే వేలల్లో పందెం కాయండి" అన్నాడు మారుతీరావు.

"ఎంత?" సదానందం అడిగాడు.

"వందలైతే ఫర్వాలేదు?" అవతారం భయం భయంగా అన్నాడు.

"మజాలేదు వందల్లో...అయినా రూపాయికి విలువ పాపాయిలా పడిపోయింది. వంద తీసుకెళితే బజార్లో ఏమొస్తుంది నా బొంద. అందుకే పదివేలు బెట్!" మారుతీరావు చెప్పాడు.

"ఆఁ! పదివేలా?" ఆశ్చర్యపోయారు.

"యస్! పదివేలు కడుతున్నా..మీరు గెలిస్తే పదివేలు...ఓడిపోతే చెరో అయిదువేలు చాలు..." తాపీగా అన్నాడు పేపరు వెయిట్‌ను టేబుల్‌పై గిరాగిరా తిప్పుతూ.

"ఓకే! నేను ఒప్పుకుంటున్నా-పందెం ఏమిటి?" అడిగాడు సదానందం.

అవతారంకు ప్రిస్టేజి ఇష్యూ అయింది. సదానందం ఒప్పుకుని తాను తప్పుకుంటే తాను వాజమ్మ అవుతాడు. తానా వెనుకబడేది- "ఆలోచిస్తా...దేనిమీద పందెం?" అవతారం అడిగాడు.

"అదీ..అబద్ధాలాడటం ఒక కళ. అబద్ధం అతికినట్లు అందరూ ఆడలేరు. మనం అసత్యం చెబుతున్నామంటే మీ- దాంట్లో కూడా కొంత సత్యం ఉంటుంది. అసలు రోజల్లా అబద్ధం చెప్పడం అసంభవం!"

మారుతీరావు తోకలేకపోవడం వలన టై ఊపుకుంటూ చెప్పాడు.

"అబద్ధంచెప్పడం అసంభవమా- సత్యం చెప్పడం కష్టం కాని- అబద్ధం చెప్పడం మనకు వెన్నతో పెట్టిన విద్య" అవతారం ఆనందంగా అన్నాడు.

"అబద్ధం చెప్పడం కష్టమే -కొంతకాలం చెప్పచ్చు-ఎల్లకాలం చెప్పలేం...ఇంతకూ మన పందెం ఎంత కాలమని?" సదానందం సాలోచనగా అడిగాడు.

"సరే..మీరు బచ్చాలు కాబట్టి ఓ ఎనిమిది గంటలు ఉదయం నుండి సాయంత్రందాకా అబద్ధం చెబితేచాలు-అదీ ఒక్కరోజే! కాని ఈ విషయం మన మధ్యే ఉండాలి. ఆఖరికి మీ ఇంట్లో వాళ్ళకి కూడా- అలా తెలిస్తే ఫైను ఇంకో పదివేలు వేస్తాను. ఇదే మన జెంటిలుమెన్ అగ్రిమెంటు" చెప్పాడు మారుతీరావు. "అంటే ఎలా...మాలో మేము చెప్పకోవాలా?" అని అన్నాడు సదానందం.

"కాదు..నేను అడుగుతాను మీరు చెప్పాలి. ఆఫీసులో పని చెడిపోతుంది. కాబట్టి ఒక సెలవురోజు పెట్టుకుందాం..." అన్నాడు మారుతీరావు.

"ఎందుకుసార్..ఎల్లుండి పండగ వస్తున్నది కదా, అప్పుడు పెట్టుకుందాం-"ఉత్సాహంగా అన్నాడు అవతారం.. పండగకు పదివేలు సంపాదించవచ్చని.

"పండగనాడు మిమ్మల్ని ఎందుకు ఇబ్బంది పెట్టాలి..ఓ ఆదివారం చూద్దాం.." మారుతీరావు జాలిగా అన్నాడు.

"ఫర్వాలేదు సార్ -ఆదివారం క్రికెట్ ఉంది-బిజీగా ఉంటాం-ఈ పండక్కి కానిచ్చేద్దాం" సదానందం చెప్పాడు.

"సరే..ఇది మన మధ్యే ఉండాలి...ఎవరికీ తెలియకూడదు-నేనే మీ ఇళ్ళకు వచ్చి పరీక్షిస్తాను మీరు ఎలా అబద్ధం చెబుతారో చూస్తాను." మారుతీరావు వాళ్ళను పంపించేస్తూ గుంభనంగా నవ్వుకున్నాడు.

'జీవితంలో మళ్ళీ పందేలు కట్టకుండా బుద్ధి చెప్పాలి' అనుకున్నాడు మారుతీరావు.

ఆ రోజు రానే వచ్చింది...సదానందం ఇల్లు- అవతారం ఇల్లు ఎదురెదురే!

మారుతీరావు మారుతీకారులో దిగాడు దర్జాగా. ఇద్దరూ బుద్ధిగా ఎదురొచ్చారు చేతులు కట్టుకుని.

"ముందు ఎవరింటికి రావాలి?"

సదానందం మౌనంగా అవతారం ఇల్లు చూపించాడు-అవతారం సరేనన్నట్లు తలాడించాడు గంగిరెద్దులా!

"ఓకే సదానందం! తరువాతి ఛాన్సు నీది..నువు మీ ఇంట్లో ఉండు వస్తాను" అని

అవతారం వెంట నడిచాడు.

వరండాలో అవతారం మేనేజర్ను కూర్చోమని కుర్చీ తెచ్చివేశాడు.

తను వినయంగా నిలబడ్డాడు. మారుతీరావు టైము చూసుకున్నాడు-పది అవుతున్నది...

అవతారం వంక చూశాడు. సూక్ష్మ గ్రాహి అవతారం తలాడించాడు.

"రాధా! మా సారుకు కాఫీ!"

"సార్! అబద్ధాలాడటం బ్రహ్మవిద్య కాదు. మీరు అనవసరంగా పదివేలు పెట్టి నష్టపోతున్నారు. ఇప్పటికైనా ఫర్వాలేదు-బెట్‌విత్ డ్రా చేసుకుందాం! ఏ మంటారు?" వినయంగా అడిగాడు అవతారం.

"ఓడిపోతానని భయపడుతున్నావా?" ఎగతాళిగా అన్నాడు మారుతీరావు.

"ఓటమి-మన జాతకంలో లేదు..ఎంతైనా మీరు మాపై అధికారి అనిజాలిపడుతున్నాను.

బెట్స్‌లో నాది లకీహ్యాండ్-ఇప్పటికి కొన్ని వందల పందేలు గెలిచాను." గర్వంగా చెప్పాడు అవతారం.

"ఆల్ ది బెస్టు...మొదలెడదాం...ఓకే!"

"ఆఁ!ఓకే!"

ఇంతలో రాధ ట్రేలో కాఫీలు తెచ్చింది. వినయంగా అతనికి నమస్కరించింది. చెరోకప్పు అందించింది.

"ఈమె నీ భార్య కదూ?" మారుతీరావు అడిగాడు అవతారాన్ని.

"అవున"ని చెప్పబోయిన అవతారంకు పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డట్టయింది.

"ఆయన మా ఆయన !" రాధ చెప్పింది.

'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకున్నాడు అవతారం.

"నేను అడిగింది అవతారంను..ఏం అవతారం నోరులేదా..ఆమె నీకేమవుతుంది.. భార్యా?" ముసిముసినవ్వులు నవ్వుతూ అడిగాడు.

"ఆఁ!కాదండి.." తడబడ్డాడు అవతారం. రాధ బిత్తరపోయింది....మాటరాలేదు.

"మరి..మీ ఇంట్లో ఎందుకుంది?"

"వంట మనిషి..." ముక్తసరిగా చెప్పాడు.

అప్పటికే రాధకు బీపీ పెరిగిపోయింది...

ఇంతలో 'అమ్మా' అంటూ బుజ్జిగాడు బయటికొచ్చాడు."ఈ బాబు నీ కొడుకా?" మారుతీరావు అడిగాడు.

"అబ్బే! కాదండి?" అవతారం అన్నాడు.

"మరి? ఇక్కడ?" ప్రశ్నించాడు.

"దానికి పుట్టినవాడండి"

"అంటే ఈబాబు..నీకు ఆమెకు పుట్టినవాడు కాదా?"

"కాదండి.." అన్నాడు అవతారం.

అంతే ! రాధ నెత్తిమీద ఉన్న నీళ్ళకుండకు చిల్లిపడింది. బొటబొట కన్నీరు కార్చేసింది. ఉద్రేకంతో ఊగిపోయింది.

"ఏమయ్యోయ్! ఏమనుకుంటున్నావు నన్ను? నీ భార్యననుకున్నావా- పనిమనిషి

అనుకుంటున్నావా? ఉంపుడుగత్తెననుకుంటున్నావా? బుజ్జిగాడు నీ కొడుకు కాడా! అంటే నేను ఎవడితో తిరిగి కన్నానా? నేను శీలంలేని బజారు మనిషినా! నోరు దగ్గర పెట్టుకుని మాట్లాడు. మీ అక్కకు- మీ చెల్లికి శీలం లేదేమో- నాకు కాదు- ఇంకో సారి ఆ మాట అంటే ఊరుకోను".

"రాధా! నీకేం తెలీదు- నువ్వు నోర్మూసుకుని లోపలికి పో!" అరిచాడు అవతారం.

"లోపలికా పోను- ముందు ఇది తేల్చు. నేనెవర్ని? వీడెవడు? ఎవడికి పుట్టాడు"?

"అబ్బా! నే చెప్పేది నీకర్థం కాదు..లోపలికి ఫో -అవతల మా సారున్నారు- ఆయన ముందు సీను క్రియేట్ చేయొద్దు" అవతారం ఏడుపు గొంతుతో అన్నాడు.

రాధ ఏడ్చుకుంటూ లోపలికి వెళ్ళింది..

బుజ్జిగాడి వీపు పేలిపోయింది..వాడు ఆరునొక్క రాగం అందుకున్నాడు.

"మీ ఇద్దరిదీ చాలా అనుకూలమైన దాంపత్యం లాగుంది...ఆమెని ఎందుకలా బాధపెడతావు...పోయి నిజం చెప్పి ఓదార్చు" మారుతీరావు జాలిగా అన్నాడు.

అవతారం లేవబోయి-కళ్ళముందు పదివేలు కనిపించి-ఆగిపోయాడు.

ఇంటిముందు ఆటో ఆగింది. ఆటోలోంచి ఒక ముతకశాల్తీ దిగింది...చేతిలో కూరల బుట్టతో...భుజాన ఒక సంచీతో!

"ఏమోయ్! అల్లుడూ కులాసానా? పండగ కదా- ఇంటికి పిల్చుకుపోదామని వచ్చాను బాగున్నావా?" అప్పారావు అడిగాడు.

"బాగాలేను" చెప్పాడు అవతారం.

"ఈయన ఎవరోయ్ అవతారం?" మారుతీరావు అడిగాడు.

"కొంపదీసి మీ మామగారా?"

అప్పారావు కిందనుంచి పైకి ఎగాదిగా మారుతీరావు ను చూశాడు.

"నాకు తెలీదు" అవతారం చెప్పాడు.

నిర్ఘాంతపోయాడు అప్పారావు. తేరుకుని చెప్పాడు. "కొంపతీయకుండానే నేను ఈయనకు మామను-అప్పారావును-మా అమ్మాయినీ ఇచ్చి చేశాను. ఈ రోజు ఈయనికి ఒంట్లో బాగున్నట్లులేదు-మనుషుల్ని సరిగ్గా గుర్తుపట్టడంలేదు"

"నా పేరు మారుతీరావు-మీ అవతారంకు మేనేజర్ని-ఏం? అవతారం ..ఆయన మీ మామట-నిజమేనా?"

"పచ్చి అబద్ధం!" అన్నాడు అవతారం.

"మరి రాధ ఈయన కూతురుకాదా?"

"నాకు తెలీదు"

"బుజ్జి ఈయన మనవడు కాదా?"

"అదీ నాకు తెలీదు".

"మరీ నీకేం తెలుసయ్యా! నిన్నేమన్నా పిచ్చి కుక్క కరిచిందా?" కోపంగా అరిచాడు అప్పారావు.

"అదీ తెలీదు"

"పోనీ...ఆయన మీ మేనేజరేనా?"

"కాదు..." చెప్పాడు అవతారం.

"నాన్నా!" సూట్‌కేసు ఒక చేత్తో-చంకన బుజ్జితో రాధ బయటకొచ్చింది ఏడుస్తూ.

"ఏమైందమ్మా!" అడిగాడు అప్పారావు.

"మీ అల్లుడు పూర్తిగా మారిపోయాడు నాన్నా! నేను ఒక్క క్షణం ఈ ఇంట్లో ఉండను-పద నీ వెంబడి వచ్చేస్తా!" అంటూ ఏడ్చేసింది.

"ఏం అల్లుడు-ఏంటి కథ?" కోపంగా ఊగిపోతూ గట్టిగా అడిగాడు అప్పారావు.

మారుతీరావు గుచ్చి గుచ్చి చూస్తున్నాడు-ఏం చెబుతాడా అని.

"ఎవరు నీకు అల్లుడు"? అప్పారావుతో అన్నాడు అవతారం.

అంతే!అక్కడ మూడో ప్రపంచ యుద్ధం రాజుకుంది.

'మళ్ళీ వస్తా' అంటూ మారుతీరావు జారుకున్నాడు సదానందం ఇంటికి.

"రండి సార్..ఏదో గొడవ జరిగినట్లుంది ఎదురింట్లో..."

"అదిసరే..మీ ఇంట్లో సందడిలేదు ..మీ వాళ్ళులేరా?" అనడిగాడు మారుతీరావు.

"కూర్చోండి...చెప్పండి..."

"నీ భార్యను పరిచయం చెయ్యి" అడిగాడు మారుతీరావు.

"లేదు"చెప్పాడు సదానందం.

"అంటే అసలు నీకు భార్య లేదనా-ఇప్పుడు ఇక్కడ లేదనా?"

"నాకు పెళ్ళేకాలేదండి-భార్య ఎక్కడ్నించి వస్తుంది" సదానందం చెప్పాడు ఏ మాత్రం తొణక్కుండా.

"మరి ఆ దండెం మీద చీరలు-లంగాలు కనిపిస్తున్నాయి. ఎవరివోయ్ అవి!" ఆశ్చర్యంగా అడిగాడు మారుతీరావు.

"అవా..మా..గరల్ ఫ్రెండువి"

"ఐసీ-అయితే నువ్వు-నీ గరల్ ఫ్రెండు ఒకే ఇంట్లో ఉంటున్నారన్నమాట...కాపురం చేస్తున్నారా?"

"ఛీ! లేదు! ఫ్రెండ్‌షిప్ అంతే!"

"ఐసీ..ఇందాక నీ గరల్ ఫ్రెండును ఇంకెవరో బోయ్‌ఫ్రెండుతో చూశానే! ఎక్కడబ్బా! ఆ గుర్తొచ్చింది..మా ఫ్రెండు కోసం హోటల్‌కు వెళితే ఓ రూములో ఎవరితోనో కులుకుతూ ఉంటే చూశాను".

"ఇంపాజిబుల్! ఆమె శ్రీశైలం వెళ్ళింది"కోపంగా అన్నాడు సదానందం.

"పాపం! అలా అని నీతో చెప్పిందేమో- నా కళ్ళతో చూశాను" అన్నాడు.

"ఇటీజ్ టూమచ్!" మారుతీరావుపై ఆవేశపడ్డాడు సదానందం.

"అంతే కాదోయ్! ఈమెను తరుచూ చాలామంది మగాళ్ళతో చూస్తూ ఉంటాను. బొత్తిగా ఈమెకు క్యారెక్టర్ అంటే ఏ మాత్రం గౌరవం ఉన్నట్లు లేదు."

"ఎవర్ని చూసి ఎవరనుకున్నారో!"

"అవునోయ్ ఈ ఇంటికి అద్దె ఎంతిస్తున్నావు?" అడిగాడు మారుతీరావు.

"అబ్బే ఇదీ నా సొంతం -దీనికి నేను అద్దె ఇవ్వడమేంటి?"

అప్పుడే ఇంటి ఓనరు లోపలికొచ్చాడు- ఆ మాటవిని ఖంగుతిన్నాడు.

"అరే! ఇల్లునీదా? ఎంత ధైర్యం ఆ మాట అనడానికి-వెంటనే ఇల్లు ఖాళీ చెయ్యి."

ఆ మాటలు విన్న సదానందం గుండెలు లబలబ కొట్టుకున్నాయి. ఆ ఊళ్ళో ఇళ్ళు దొరకడమే కష్టం! అన్ని సౌకర్యాలు ఉండి-సెంటర్లో ఉన్న ఇల్లు ఖాళీ చేస్తే అసలు దొరకదు ఆరెంటుకు.

"సదానందం..ఈయన మీ ఇంటి ఓనరా? ఈ ఇల్లు ఆయనదా? నువ్వు